మంగళవారం కామారెడ్డిలో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, వేదికపై ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబుద్దీన్, మున్సిపల్ చైర్‌పర్సన్ జాహ్నవి

మావారెడ్డిలో నిర్వహించిన సమావేశానికి భారీగా హాజరైన బీఆర్ఎస్ కార్యకర్తలు

కొడంగల్‌లో చెల్లనోడు.. కామారెడ్డిలో చెల్లుతడా?

కూట్ల రాయి తీయనోడు ఏట్ల రాయి తీస్తడట

చికెన్ షాప్ ఎదుట నిల్చొని కోడి తొడకొట్టినట్టు ఉన్నది టీపీసీసీ చీఫ్ రేవంత్ వ్యవహారం

రేవంత్‌కు, బీజేపీకి ఉద్యమ సత్తా చూపాలి

కామారెడ్డిలో కేసీఆర్ విజయం తథ్యం

కేసీఆర్ రాకతో ప్రతిపక్షాల ఫ్యూజులు అవుట్

గోదారి జలాలతో రైతుల పాదాలు కడుగుతం

అఖండ మెజార్టీతో కేసీఆర్‌ను ఆశీర్వదించండి

కామారెడ్డి, మాచారెడ్డి కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్

> 55 ఏండ్లు కాంగ్రెస్ పాలన చక్కగా ఉండి ఉంటే.. కరెంట్ చక్కగా ఇచ్చి ఉంటే.. మంచి నీళ్లు ఇచ్చి ఉంటే.. గోదావరి నీళ్లు తెచ్చే ప్రయత్నం చేస్తే ఈ సమస్యలు ఉంటుండేనా? ఒక్క చాన్స్ అంటే నమ్మొద్దు. ద్రోహులు వారు. నమ్ముదామా?
>
> -మంత్రి కేటీఆర్

నిజామాబాద్, అక్టోబర్ 31 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): 'కొడంగల్‌లో చెల్లనోడు.. కామారెడ్డిలో చెల్లుతడా?.. కూట్ల రాయి తీయనోడు ఏట్ల రాయి తీస్తడట' అని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ చురకలంటించారు. కామారెడ్డిలో కేసీఆర్ విజయం తథ్యమని ధీమా వ్యక్తంచేశారు. కేసీఆర్‌లాంటి నాయకుడు దేశంలో మరెక్కడా ఉండరని చెప్పారు. తెలంగాణలో ఎక్కడికి పోయినా నా బిడ్డ అని గుండెలకు హత్తుకుంటారని, అలాంటి కేసీఆర్ మీ (కామారెడ్డికి) దగ్గరికే రావాలని నిర్ణయించుకోవడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని తెలిపారు. కామారెడ్డి దశ మార్చేందుకు కేసీఆర్ ఇక్కడికి వచ్చారని చెప్పారు. సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్న కామారెడ్డి నియోజకవర్గంలో కేటీఆర్ మంగళవారం పర్యటించారు. పాత మాచారెడ్డి, పాత కామారెడ్డి మండలాలవారీగా బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీజేపీ నుంచి పలువురు ముఖ్య నేతలు బీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. భారీ మెజార్టీ లక్ష్యంగా శ్రేణులంతా కలిసికట్టుగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.

> తెలంగాణలో వ్యవసాయ విస్తరణ జరిగింది. బియ్యం ఉత్పత్తిలో తెలంగాణ దేశంలోనే నంబర్‌వన్ రాష్ట్రంగా మారింది. ఈసారి గెలువంగనే తెల్ల రేషన్ కార్డుంటే దొడ్డు బియ్యం బదులు సన్నబియ్యం ఇస్తామని కేసీఆర్ మ్యానిఫెస్టోలో పెట్టారు. పిల్లలకు మూడో పూట కూడా సన్నబియ్యంతోనే అన్నం లభిస్తుంది. వండి పెట్టుడు, మూతి తుడుసుడు తప్పా అన్నీ కేసీఆరే చేస్తుండు. పుడితే కేసీఆర్ కిట్.. దబ్బన ఏ కారణంతోనో చనిపోతే కేసీఆర్ బీమా.. అంటే పుట్టుక నుంచి చావు దాకా కేసీఆర్ సర్కారు అదుకుంటున్నది.
>
> -మంత్రి కేటీఆర్

గోదావరి జలాలను తీసుకొస్తాం

'ఇక్కడ రైతులందరూ ఒక్కటే కోరుతున్నరు. మాచారెడ్డిలోని భూములకు గోదావరి జలాలు తీసుకురావాలని అంటున్నారు. మంచిప్ప నుంచి ప్యాకేజీ 22 ద్వారా నీళ్లను తీసుకొస్తాం. ఐదారు నెలల్లోనే గోదావరి జలాలతో రైతుల పాదాలను కడుగుతాం.' అని కేటీఆర్ హామీ ఇచ్చారు. కేసీఆర్ వచ్చాక ఇక్కడికి అధికారులు వద్దన్నా వస్తారని చెప్పారు. కాలువలు తవ్వేటప్పుడు ప్రజలు సహకరించాలని కోరారు. ప్రాజెక్టు వస్తే లక్షలాది మందికి లాభం జరుగుతుందని తెలిపారు. కామారెడ్డి నియోజకవర్గం కోసం మిషన్ భగీరథ పాత పైప్‌లైన్ స్థానంలో కొత్త పైపులు మార్చేందుకు రూ.195 కోట్లు మంజూరయ్యాయని, నాలుగైదు నెలల్లోనే పనులు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఎండాకాలంలో గోస లేకుండా తాగునీరందించే బాధ్యత తానే తీసుకుంటానని కేటీఆర్ మాట ఇచ్చారు.

కాంగ్రెస్‌కు ఒక్క ఓటేసినా నాశనమే

'పొరపాటున కాంగ్రెస్‌కు ఒక్క ఓటు వేసినా నాశనమే' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. 'నేనీ మధ్య పేపర్‌లో చూశా.. షబ్బీర్‌అలీ సాబ్ పారిపోతున్నారు. ఇక్కడికి రేవంత్‌రెడ్డి వస్తాడంట. కొడంగల్‌లోనే గెలువనోడు ఇక్కడచ్చి గెలుస్తడట. చికెన్‌సెంటర్ ముందుకొచ్చి కోడి తొడ కొట్టిందంట. అట్లనే రేవంత్‌రెడ్డి పరిస్థితి ఉన్నది.' అని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డికి, బీజేపీకి కామారెడ్డి ఉద్యమ సత్తా ఏమిటో చూపెట్టాలని పిలుపునిచ్చారు. వారి డిపాజిట్ గల్లంతు కావాలని అన్నారు. 'ఉద్యమద్రోహి రేవంత్.. ఉద్యమకారులపైకి తుపాకి ఎత్తినోడు.. కామారెడ్డికి వస్తానంటే ఆయన్ని నమ్మేటోళ్లు పిచ్చోళ్లమా.' అని ప్రశ్నించారు.

గుజరాత్, ఢిల్లీ గులాంలు మనకెందుకు?

గుజరాత్, ఢిల్లీ గులాంలు మనకు అవసరమా? అని బీజేపీ, కాంగ్రెస్‌ను ఉద్దేశించి మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారు. రైతుబంధు ఇయ్యాలని ఆలోచన రాగానే హైదరాబాద్‌లోనే నిర్ణయం తీసుకొని 11 సీజన్లలో 70 లక్షల మంది రైతులకు రూ. 73 వేల కోట్లు ఖాతాలో వేసిన నాయకుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. 55 ఏండ్లలో కాంగ్రెస్ పుర్రెలో ఈ ఆలోచన ఎందుకు రాలేదని మండిపడ్డారు. నాట్లు వేసే సమయం వచ్చిందంటే సెల్‌ఫోన్లు టింగ్‌టింగ్‌మంటూ ఎకరాకు రూ.5 వేలు మీ ఖాతాలో పడుతున్నాయా? లేదా? అని అడిగారు. ఉచితంగా రైతులకు కరెంట్ ఇచ్చే నాయకుడు కేసీఆర్ ఒక్కరేనని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీజేపీ వాళ్లు బాత్‌రూమ్‌కు పోవాలన్నా ఢిల్లీనుంచే పర్మిషన్ రావాలని, అలాంటోళ్లను నమ్మొద్దని సూచించారు.

> కాంగ్రెస్ పాలనలో అంజుమాన్ బ్యాంకోడు దర్వాజాలు ఎత్తుకపోతుండే. కిటికీలు ఎత్తుకపోతుండే. ఆ రోజన్నా వాళ్లకు ఆలోచన వచ్చిందా? పెట్టబడి ఇయ్యాలె అని కాంగ్రెస్‌వాళ్లు ఆలోచన చేసిండ్రా?
>
> -మంత్రి కేటీఆర్

మాస్టర్‌ప్లాన్ రద్దు చేశాం

'కేసీఆర్ వస్తుండని జబ్బలు చరిచినోళ్లు, తొడలు కొట్టినోళ్ల ఫీజులు ఎగిరిపోయాయి. పోటీ చేయాల్నా వద్దా.. తప్పించుకుని ఎట్లా పోదామని ఆలోచిస్తున్నరు.' అని కేటీఆర్ ప్రతిపక్షాలకు చురకలంటించారు. మొదట్నుంచి కామారెడ్డిలో గులాబీ జెండా తప్పా మిగిలిన జెండా ఎగిరే పరిస్థితి లేదని చెప్పారు. కామారెడ్డిలో పోటీ అంటే పోచమ్మ గుడి ముందర గొర్రెపోతును కట్టేసినట్టేనని ప్రతిపక్షాలకు అర్థమైందని అన్నారు. కేసీఆర్ వస్తుండని ప్రజలే స్వచ్ఛందంగా ఏకగ్రీవ తీర్మానాలు చేస్తున్నారని, భవిష్యత్తులో తప్పకుండా కామారెడ్డి నియోజకవర్గం రాష్ట్రంలోనే నంబర్ వన్ అవుతుందని ప్రజలే అంటున్నారని చెప్పారు. కామారెడ్డి మాస్టర్‌ప్లాన్‌ను రద్దు చేశామని, పాత మాస్టర్‌ప్లాన్ మాత్రమే అమల్లో ఉంటుందని స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు మతిలేని ఆరోపణలు చేస్తున్నాయని ధ్వజమెత్తారు.

సీఎం సభను విజయవంతం చేయాలి

'మీరే కథానాయకులైతే మాచారెడ్డి మండలం నుంచే 20 వేల మెజార్టీ వస్తుంది. నవంబర్ 9న కేసీఆర్ నామినేషన్ వేస్తారు. మిమ్మల్ని దయచేసి కోరేది ఒక్కటే. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా కామారెడ్డిలో సభను విజయవంతం చేసి చూపించాలి. కేసీఆర్ వెంటే ఉన్నామంటూ మద్దతు తెలపాలి.' అని కేటీఆర్ కోరారు. రానున్న 30 రోజులు అప్రమత్తంగా ఉండాలని, ప్రతిపక్షాలకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, ఫుడ్ కమిషన్ మాజీ చైర్మన్ తిరుమల్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అయాచితం శ్రీధర్, మున్సిపల్ చైర్మన్ నిట్టు జాహ్నవి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబుద్దీన్, నేతలు నిట్టు వేణుగోపాల్, ఎంపీపీ నర్సింగరావు, కేసీఆర్ బావ వకీల్ రామారావు, సుభాష్‌రెడ్డి, గంప శశాంక్ పాల్గొన్నారు.

మా మద్దతు రామన్నకే..

బాబాజీ వెల్ఫేర్ అసోసియేషన్ ఏకగ్రీవ తీర్మానం

సిరిసిల్ల రూరల్, అక్టోబర్ 31: సిరిసిల్ల బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి కేటీఆర్‌కు రోజు రోజుకు అన్నివర్గాల నుంచి మద్దతు పెరుగుతున్నది. తంగళ్లపల్లిలోని బాబాజీ కులస్థులు మంగళవారం సంపూర్ణ మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఏకగ్రీవ తీర్మానం చేసినట్టు అధ్యక్షుడు ఇనుకొండ మారయ్య ప్రకటించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఈ నెల 30న గంప గుత్తగా కేటీఆర్‌కు తమ ఓట్లు వేస్తామని తీర్మానం చేశారు. తీర్మాన ప్రతిని, నామినేషన్ ఖర్చుల కోసం నగదును ఎంపీపీ పడిగెల మానస, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు బండి జగన్, ప్రజాప్రతినిధులు, నాయకులకు అందజేశారు.

బీజేపీ పాలనలో బేరోజ్‌గార్ మేళా

మొదటిపేజీ తరువాయి...

కష్టాలు మొదలయ్యాయని ఆవేదన వ్యక్తంచేశారు. తొమ్మిదేండ్లలో ఏడాదికి రెండు కోట్ల చొప్పున 18 కోట్ల ఉద్యోగాల నియామకాలు చేపట్టనందుకు యువతకు బేషరతుగా బీజేపీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగాలను ఎత్తగొట్టిందే బీజేపీ

45 ఏండ్లలో ఎప్పుడూలేని నిరుద్యోగిత రేటు మోదీ హయాంలోనే నమోదైందని, ఇది సిగ్గుచేటని కేటీఆర్ విమర్శించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఇచ్చిన హామీ కన్నా ఎక్కువగా ఉద్యోగాలు భర్తీచేసినట్టు చెప్పారు. ఇప్పటికే 1,32,000 ఉద్యోగాలను భర్తీ చేశామని, మరో 90వేల ఉద్యోగాల భర్తీ ప్రక్రియ శరవేగంగా పూర్తికాబోతున్నదని చెప్పారు. రాష్ట్రంలో ఉద్యోగ నియామక ప్రక్రియలో జాప్యానికి కారణమే బీజేపీ అని ధ్వజమెత్తారు. 'లక్షలాది మంది నిరుద్యోగుల జీవితాలను ఆగం చేసేలా పేపర్ లీకేజీకి పాల్పడింది మీ పార్టీ ఎంపీ బండి సంజయ్ అనుచరుడే అనే విషయాన్ని మీరు గుర్తుంచుకుంటే మంచిది' అని ఆయన కిషన్‌రెడ్డికి గుర్తుచేశారు. కేంద్ర మంత్రిగా కిషన్‌రెడ్డి ఒక్కనాడైనా విభజన హామీలపై నోరుమెదిపారా? అని ప్రశ్నించారు. కిషన్‌రెడ్డి కేంద్ర సహాయ మంత్రికాదని.. నిస్సహాయ మంత్రి అని ఆయన ఎద్దేవా చేశారు.

బీజేపీ దివాళాకోరుతనం

పదేండ్లలో తెలంగాణ ప్రభుత్వం భర్తీ చేసినన్ని ఉద్యోగాలను దేశంలోని ఏ రాష్ట్ర ప్రభుత్వమైనా భర్తీ చేసిందా చెప్పాలని కిషన్‌రెడ్డికి కేటీఆర్ సవాల్ విసిరారు. ఎన్డీఏ ప్రభుత్వం పదేండ్లలో భర్తీ చేసిన ఉద్యోగాలపై శ్వేతపత్రం విడుదల చేసే దమ్ముందా? అని ప్రశ్నించారు. కేంద్రంలో ఖాళీగా ఉన్న 16 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయకుండా తమను కిషన్‌రెడ్డి విమర్శించడం దివాళాకోరుతనానికి నిదర్శనమని అన్నారు. తెలంగాణ నిరుద్యోగుల జీవితాలను ఆగం చేస్తూ వారిని రాజకీయాలకు వాడుకొనే కుట్రలకు ఇప్పటికైనా మానుకోవాలని కిషన్‌రెడ్డికి కేటీఆర్ సూచించారు. ప్రభుత్వరంగంలో ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగంగా చేపట్టడంతోపాటు దేశంలోనే ప్రైవేటు రంగంలో అత్యధికంగా ఉద్యోగాలు కల్పించిన రాష్ట్రం తెలంగాణ అనే విషయాన్ని కిషన్‌రెడ్డి తెలుసుకొంటే మంచిదని హితవుపలికారు.

..రక్తచరిత జాడలు

మొదటిపేజీ తరువాయి...

నుంచే ప్రగతి, ప్రజాసంక్షేమం పైనే ప్రధాన దృష్టి నెలకొంటుంది. అందుకే చిన్న రాష్ట్రమైనా అనతికాలంలోనే తెలంగాణ అన్నిరంగాల్లో దేశానికే దిక్సూచిలా నిలిచింది. కానీ రెండురోజుల క్రితం ఎంపీ, దుబ్బాక బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై కాంగ్రెస్ కార్యకర్త కత్తిపోట్లకు పాల్పడిన ఘటనతో తెలంగాణ ఉలిక్కిపడింది. ఈ ఘాతుకానికి ఒడిగట్టిన దుండగుడి అసలు కండువా రంగును చూసి కలవరపడుతున్నది. పచ్చటి తెలంగాణలో ఎక్కడిదీ నెత్తుటి రాజకీయం? ఎక్కడిదీ విషసంస్కృతి? అన్న చర్చ మొదలైంది. కత్తిపోట్ల ఉదంతంతో ప్రజలు గతాన్ని జ్ఞప్తి చేసుకుంటున్నారు. కుర్చీలాటలో కాంగ్రెస్ నెత్తుటి కోలాటాలాడిన రోజుల్ని గుర్తుచేసుకుంటున్నారు. గాంధీగిరి నుంచి గుండాగిరి వైపు శరవేగంగా దిగజారి నెత్తుటి సిరాతో రాసిన హస్తాక్షర పుటలు ఆందోళన కలిగిస్తున్నాయి.

కర్ఫ్యూలు.. కన్నీళ్లు

ముఖ్యమంత్రి కుర్చీ కోసం కాంగ్రెస్‌లోని ప్రత్యర్థులే హైదరాబాద్ నడిబొడ్డున సాగించిన నరమేధం ఇప్పటికీ కండ్లముందు కదలాడుతున్నది. బాబ్రీ మసీదు ఘటనతో హైదరాబాద్ నగరం కర్ఫ్యూ నీడలో గజగజా వణికిపోయింది. 1990 డిసెంబర్‌నాటి దుర్దినాల వెనుక అధికార దాహం దాగి ఉన్నదని సాక్షాత్తూ అప్పటి కాంగ్రెస్ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి ప్రకటించడం పాత పత్రికల ప్రతుల్లో పదిలంగానే ఉన్నది. హిందువును నరికిన అదే కత్తితో ముస్లిం సోదరుడిని సైతం పొట్టన పెట్టుకున్న అప్పటి 'సృష్టించబడిన మత కల్లోలం (ఇంజినీర్డ్ వాయ్‌లెన్స్)' కారణంగానే మర్రి చెన్నారెడ్డి ముఖ్యమంత్రి కుర్చీని వీడాల్సి వచ్చిందని కాంగ్రెస్ సీనియర్లు, బుద్ధిజీవులు పలు సందర్భాల్లో గుర్తుచేస్తూ ఉంటారు. కాంగ్రెస్‌లో అధికారం కోసం ఎంతకైనా తెగిస్తారనేందుకు ఇదే చారిత్రక రుజువు.

గతమంతా తడిసె రక్తమున..

వంగవీటి రంగా హత్య సమయంలో విజయవాడ, ఉభయ గోదావరి జిల్లాల్లో చెలరేగిన హింసాత్మక ఘటనలు, అల్లర్లు.. సంబంధంలేని హైదరాబాద్ నగరానికీ వ్యాపింపచేశారు. వనస్థలిపురం సమీపంలో కాంగ్రెస్ నాయకులు డబుల్ డెక్కర్ బస్సును దగ్ధం చేశారు. ఒక రాజకీయ నాయకుడి మరణం.. శాంతిభద్రతల విఘాతానికి దారితీయడం అప్పటివరకు తెలంగాణ ఎన్నడూ చూడలేదు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నపుడే.. జూబ్లీహిల్స్‌లో బాంబుపేలుళ్లు జరిగాయి. 1997 నవంబర్ 20న టీడీపీకి చెందిన మాజీ మంత్రి పరిటాల రవిని హతమార్చేందుకు ఆయన ప్రత్యర్థులు మాటువేసి అమలు చేసిన బాంబు పేలుళ్లలో ఏకంగా 23 మంది చనిపోయారు. అప్పటివరకు హైదరాబాద్ నగరానికి ఫ్యాక్షన్ సంస్కృతి వాసనలేవీ తెలియవు.

కేసీఆర్ పాలనలో పదేండ్లు ప్రశాంతంగా..

తెలంగాణ ఏర్పడిన ఈ పదేండ్ల కాలంలో కరువు లేదు, కర్ఫ్యూ లేదు. ఎన్నికలవేళ ప్రజాక్షేత్రంలో రాజకీయ విమర్శలు, పరస్పర ఆరోపణలే తప్ప పదేండ్లలో రాష్ట్రంలో చిన్న ఉద్రిక్త ఘటన కూడా చోటుచేసుకోలేదు. అనునిత్యం అభివృద్ధి, సంక్షేమం అంటూ ప్రభుత్వయంత్రాంగాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ అలుపెరుగక పరుగులు పెట్టించడం అందుకు కారణం. తెలంగాణ గాయాలను మాన్పేందుకు నీళ్లు ఎలా తేవాలి? నిధులు ఎలా సమీకరించాలి? వలసలను ఎలా నిర్మూలించాలి? ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎలా పెంచాలి? ప్రతిక్షణం పాలకుడు ఈ ఆలోచనలతో ఉంటే.. ప్రజలు మరోవైపు ఎలా చూస్తారు? అందుకు ప్రజల సంపూర్ణ సహకారంతో తెలంగాణ పోలీసింగ్ కొత్త శిఖరాలకు చేరింది. రాష్ట్రం ప్రశాంతంగా ఉన్నది కాబట్టే పెట్టుబడులు వెల్లువలా తరలివచ్చాయి.అంతర్జాతీయ దిగ్గజ కంపెనీలు అమెరికా ఆవల తమ రెండో క్యాంపస్‌ను తెలంగాణలో ఏర్పాటు చేయడానికి ఈ శాంతియుత వాతావరణమే కారణం. అయితే ఈ ప్రశాంత వాతావరణం పదేండ్లకే పలుచబడొద్దు. భవిష్యత్తులోనూ శాంతిభద్రతలకు భరోసా ఇస్తారన్న నమ్మకం ఉంటేనే ప్రగతి యజ్ఞం నిర్విఘ్నంగా కొనసాగుతుందన్నది నిర్వివాదాంశం. నాలుగు ఓట్ల వేటలో రాజకీయ కక్షలకు తెలంగాణ ఆగం కావొద్దని, అద్దాల మేడపై చిన్న రాయి పడినా పగుళ్లు తప్పవని మేధావులు హెచ్చరిస్తున్నారు. అయితే రాష్ట్రాన్ని పదిలంగా చూసుకోవడం అనేది ప్రజల చేతుల్లోనే ఉందని వారు గుర్తు చేస్తున్నారు.

అధికారం కోసం ఎంతకైనా..

> రాష్ట్రమేదైనా అధికారం కోసం కాంగ్రెస్ ఎంతకైనా తెగబడుతుందనడానికి ఉదాహరణలు ఎన్నో ఉన్నాయి. కర్ణాటకలో 1989 ఎన్నికల్లో లింగాయత్ వర్గానికి చెందిన మాజీ సీఎం వీరేంద్రపాటిల్ సిరహట్టి నుంచి గెలిచి, రెండోసారి ముఖ్యమంత్రి అయ్యారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలో పెరుగుతున్న లిక్కర్ లాబీయింగ్‌ను నియంత్రించేందుకు ఎక్సైజ్ సుంకాన్ని 2 నుంచి 20 శాతానికి పెంచారు. ఇది సొంతపార్టీలోని పైరవీకారులకు నచ్చలేదు. వీరేంద్రపాటిల్‌ను గద్దెదించడమే లక్ష్యంగా మత ఘర్షణలు సృష్టించారు. ఫలితంగా 11నెలలైనా గడవకముందే పాటిల్ సీఎం పీఠం నుంచి దిగిపోవాల్సి వచ్చింది. రెండు పర్యాయాలు కర్ణాటక ముఖ్యమంత్రిగా పని చేసి, కాంగ్రెస్‌కు ఎనలేని సేవలు చేసిన తనను ఇలా అవమానించడం తట్టుకోలేక పదవీచ్యుతుడైన పాటిల్ అదేసమయంలో గుండెపోటుకు గురయ్యారు.

లెఫ్ట్‌కు మొండి 'చెయ్యి'?

వారి సీట్లలోనూ కాంగ్రెస్ అభ్యర్థులు నేడు వామపక్ష నేతల సమావేశం

హైదరాబాద్, అక్టోబర్ 31(నమస్తే తెలంగాణ): రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, వామపక్షాల మధ్య పొత్తు కుదిరే అవకాశం కనిపించడం లేదు. వామపక్షాలతో పొత్తు, సీట్ల సర్దుబాటుపై చర్చలు జరిపిన కాంగ్రెస్ చివరకు మొండి చెయ్యి చూపించేందుకు సిద్ధమైంది. సీపీఐ, సీపీఎంకు ఇస్తామన్న రెండు స్థానాలపై కూడా వెనకడుగు వేస్తున్నట్టు తెలిసింది. వామపక్షాలతో ఒకవైపు చర్చలు జరుపుతూనే మరోవైపు ఆ పార్టీలు కోరుతున్న స్థానాల్లో కూడా తమ అభ్యర్థులను ఖరారు చేసినట్టు సమాచారం. సీపీఐ కోరుకుంటున్న కొత్తగూడెం, చెన్నూరు స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులుగా మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు, గడ్డం వంశీని ఖరారు చేశారనే ప్రచారం జరుగుతున్నది. సీపీఎం కోరుతున్న మిర్యాలగూడ, వైరా స్థానాల్లో బత్తుల లక్ష్మారెడ్డి, విజయాబాయిని నిర్ణయించినట్టు తెలిసింది. ఈ నెల 3 నుంచి నామినేషన్లు ప్రారంభమవుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ వ్యవహారశైలి, పొత్తుల అంశంపై తెల్చుకునేందుకు బుధవారం హైదరాబాద్‌లో వామపక్షాల రాష్ట్ర కమిటీ నేతలు సమావేశం కానున్నారు. సమావేశంలో పొత్తులపై చర్చించి, తుది నిర్ణయం ప్రకటిస్తామని సీపీఐ, సీపీఎం రాష్ట్ర కార్యర్శులు కూనంనేని సాంబశివరావు తమ్మినేని వీరభద్రం వెల్లడించారు.

దుబ్బాక కాంగ్రెస్‌లో ముసలం

- పార్టీ అభ్యర్థి శ్రీనివాస్‌రెడ్డిపై తిరుగుబాటు
- నేడు బీఆర్ఎస్‌గూటికి కూకట్‌పల్లి నేత గొట్టిముక్కల వెంగళ రావు
- ఆదిలాబాద్‌లో కార్యకర్తల సమావేశానికి సీనియర్ల గైర్హాజరు
- బోథ్‌లో వెలవెలబోయిన వన్నెల ఆశోక్ బైక్ ర్యాలీ

తొగుట సమీపంలోని ఓ తోటలో సమావేశమైన దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ నేతలు

సిద్దిపేట/ఆదిలాబాద్/కేపీహెచ్‌బీ కాలనీ/ఇబ్రహీంపట్నంరూరల్, అక్టోబర్ 31(నమస్తే తెలంగాణ ప్రతినిధి): సిద్దిపేట జిల్లా దుబ్బాక కాంగ్రెస్‌లో ముసలం మొదలైంది. చెరుకు శ్రీనివాస్‌రెడ్డికి టికెట్ కేటాయించడాన్ని నిరసిస్తూ మంగళవారం నియోజకవర్గంలోని సీనియర్ నేతలు రహస్యంగా సమావేశమైనట్టు తెలుస్తున్నది. తొగుట, రాయపోల్ మండలాల మధ్య ఓ తోటలో సమావేశమై భవిష్యత్తు కార్యచరణపై చర్చించినట్లు సమాచారం. శ్రీనివాస్‌రెడ్డి పార్టీ ప్రయోజనాల కోసం కాకుండా స్వప్రయోజనాల కోసం పని చేస్తారని ఆరోపించారు. ఇలాంటి వ్యక్తి గెలిచినా పార్టీలో ఉంటాడన్న నమ్మకం లేదని పేర్కొన్నారు. సమావేశంలో కాంగ్రెస్ సీనియర్ నేతలు ప్రభాకర్‌రెడ్డి, కిష్టారెడ్డి, చెరుకు కొండల్‌రెడ్డి,రాజిరెడ్డి, పెంటారెడ్డి, కర్నాల శ్రీనివాస్, బొమ్మెర శ్రీధర్, తదితరులు పాల్గొన్నారని సమాచారం.

దొంగల ముఠాలా పీసీసీ నేతలు

పీసీసీ నేతలు దొంగల ముఠాగా మారి.. టికెట్లు అమ్ముకున్నారని కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన కూకట్‌పల్లి నియోజకవర్గ నేత గొట్టిముక్కల వెంగళరావు ఆరోపించారు. రేవంత్‌రెడ్డి కోసం ఆదిలాబాద్‌లో నిర్వహించిన కాంగ్రెస్ సభనుంచి ఇటీవల తుక్కుగూడలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సమావేశాలకు తనలాంటి ఆశావహులంతా డబ్బులు ఖర్చుపెట్టి నాయకులు, కార్యకర్తలను తరలించి సభలను విజయవంతం చేసినట్టు తెలిపారు. ఈ ఎన్నికల్లో కూకట్‌పల్లి, శేరిలింగంపల్లిలో కాంగ్రెస్ పార్టీకి భంగపాటు తప్పదని జోస్యం చెప్పారు. రానున్న ఎన్నికల్లో పార్టీ పెద్ద చెంప ఛెళ్లుమనిపించేందుకు బీఆర్ఎస్‌లో చేరతున్నట్టు తెలిపారు. బుధవారం కూకట్‌పల్లి చిత్తారమయ్య ఆలయం నుంచి వేయిమంది అనుచరులతో ర్యాలీగా వెళ్లి సీం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరనున్నట్టు తెలిపారు.

ఆదిలాబాద్ జిల్లాలో నేతల నిరసనలు

మంగళవారం ఆదిలాబాద్‌లో నిర్వహించిన నియోజకవర్గ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి సీనియర్లు గైర్హాజరయ్యారు. ఈ సమాశానికి ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల ఏఐసీసీ పరిశీలకుడు, కర్ణాటక ఎమ్మెల్సీ రాథోడ్ ప్రకాశ్ హాజరయ్యారు. టికెట్ ఆశించిన సీనియర్ నాయకులు డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, సీనియర్ నాయకుడు సంజీవ్‌రెడ్డి, ఇతర నాయకులు, కార్యకర్తలు సమావేశానికి హాజరుకాలేదు. బోథ్‌లో పార్టీ అభ్యర్థి వన్నెల ఆశోక్ నిర్వహించిన మోటార్ సైకిల్ ర్యాలీకి టికెట్ ఆశించి భంగపడిన సీనియర్లు నరేశ్ జాదవ్, ఆడే గజేందర్, వారి మద్దతుదారులు గైర్హాజరయ్యారు. ఖానాపూర్ టికెట్ విషయంలో కాంగ్రెస్ అధిష్ఠానం తనకు అన్యాయం చేసిందని ఉట్నూర్ జడ్పీటీసీ చారులత రాథోడ్ మండిపడ్డారు. తనతోపాటు ఆసిఫాబాద్ టికెట్ ఆశించిన సరస్వతికి సైతం రేవంత్‌రెడ్డి టికెట్ నిరాకరించారని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం ప్రజల్లో ఉండే తనకు అన్యాయంచేసి, నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఓడిపోయిన మల్‌రెడ్డి రంగారెడ్డికి టికెట్ కేటాయించడం బాధగా ఉందని ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ అసమ్మతి నాయకుడు మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నంలోని సాయి ఫంక్షన్‌హాల్‌లో అనుచరులతో సమావేశమైన ఆయన.. టికెట్ మల్‌రెడ్డికి కేటాయించినప్పటికీ బీఫాం మాత్రం తనకే వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రెండుమూడు రోజుల్లో భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తానని తెలిపారు.

ఖమ్మం కాంగ్రెస్‌లో నాలుగు కుంపట్లు

- ఒకరి ఓటమికి మరొకరు అంతర్గత కుట్రలు
- కిందిస్థాయి నేతలకు ప్రలోభాలతో వల
- తలలు పట్టుకుంటున్న అభిష్ఠానం పెద్దలు

హైదరాబాద్, అక్టోబర్ 31(నమస్తే తెలంగాణ): ఖమ్మం కాంగ్రెస్‌లో ముఖ్య నేతలు నాలుగు వర్గాలుగా విడిపోయి కుంపట్లు పెట్టుకున్నారు. ఎవరికి వారు తమ ఆధిపత్యాన్ని చాటుకునేందుకు తహతహలాడుతున్నారు. తెరవెనుక కుట్రలకూ తెరలేపారనే చర్చ మొదలైంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కీలక నేతలైన భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్